# పెళ్ళికోసం

– 'అరవింద'




పార్వతి అబూదాబి వెళ్ళిపోతోంది.

నాకు గుడ్‌బై చెప్పటానికి వచ్చింది.

పార్వతి మొహంలోకి చూస్తూ ఉండిపోయాను. తను వెళ్ళబోయే ఊరు గురించి ఇంటిని గురించి చెప్తోంది– భర్త దగ్గరనుంచి తెలుసుకున్న సంగతులు అన్నీ.

నాకు ఆ విషయాల మీద కుతూహలం లేదు.

మనిషి జీవితం, అతడి ఆనందం, ఎంతవరకూ అతడి చేతుల్లో వున్నాయి? అనే ఆలోచనలో పడిపోతున్నాను. అంతలో స్ఫురించింది.

"నీ కథ రాయాలని ఉంది పార్వతీ....నీకేమైనా అభ్యంతరమా?" అడిగాను.

పార్వతి చెప్పడం ఆపేసి మౌనంగా వుండిపోయింది కాసేపు. తరవాత నవ్వింది.

"అభ్యంతరం లేదు. నా పెళ్ళి మీ కథకి పనికి వస్తుందనుకుంటే తప్పకుండా రాయండి" అంది.

పార్వతి వెళ్ళిపోయాక కూడా అవే ఆలోచనలు నన్ను వదలలేదు. పెళ్ళి అనగానే ఎంత ఆలోచన! ఎన్ని అనుమానాలు! అవ్యక్తమైన భయం. అందుకే ఈ కాలపు అమ్మాయిలు, అబ్బాయిలూ కూడా ఆలోచిస్తూ చాలా కాలం పెళ్ళిచేసుకోకుండా గడిపేస్తున్నారు.

గట్టుమీద నిలబడి చూస్తూ ఉండాల్సిన సంగతా ఇది! ప్రవాహంలో దూకేసి ఈత కొట్టెయ్యాలిగానీ. మునుగుతామో తేల్తామో అది వేరే సంగతి.

గట్టున నిలబడి చూస్తుంటే ఆలోచనలతో అనుమానాల్తో గడిపేస్తుంటే తాళం వేసిన గదిలోపల ఏముందో రాజకుమారుడికి ఎప్పటికీ తెలియదు. ఐనా కాస్తంత కష్టపడటానికి ఓ గ్లాసుడైనా కన్నీళ్ళు కార్చడానికీ ఇష్టపడనివాళ్ళు ఈ ప్రపంచంలో బ్రతకటానికి అనర్హులు.

పార్వతిని తెలిసిన వాళ్ళెవరూ పార్వతి అందంగా వుంటుందని అనుకోరు. కానీ అందానికి నిర్వచన మేమిటి?

చూసేవారి కన్నుల్లో ఉంటుందన్న మాట నిజం.

నిరాకారుడు, గుణాతీతుడు, చిదానంద రూపుడు అయిన ఈశ్వరుడి సృష్టిలో ఏదీ అందవిహీనంగా ఉండకూడదు.

పనికిరాని వస్తువు అంటూ లేదు.

పార్వతి తనను అద్దంలో చూసుకున్నప్పుడు ఆమె కళ్ళకి ఆమె ప్రతిబింబం చక్కదనాలు పోదవుకున్నట్లే కనిపిస్తుంది. నిజానికి చెప్పుకోదగ్గ అందం ఉన్నవాళ్లు ఎంతమంది వుంటున్నారు. పెళ్ళి మాట వచ్చినప్పుడు తండ్రి పార్వతిని నల్లగా ఉంటావ్ అంటుంటాడు.

అప్పుడు పార్వతికి చాలా కోపం వస్తుంది.

తను ఎవరి పోలిక అనుకుంటాడో! ఆయన రంగేకదూ తనకి వచ్చింది. నలుపులో మాత్రం అందం లేదా?

తెల్లగా ఉన్న వాళ్ళంతా అందంతో మెరిసిపోతున్నారా?

ఆ హృదయం వుండాలేగానీ గుమ్మడికాయలోనూ, ఉడతపిల్లలోనూ కూడా అందాలు గోచరిస్తాయి. అసలు మనువాడి మనుగడ సాగించటానికి ముఖ్యమైనది ఏమిటి? మనసా, అందమా?

రెండూ ఎప్పుడోగానీ జతపడవు.కోరుకోవాల్సివస్తే అందంతో కూడిన చెడ్డ మనసుకంటె అందం లేకపోయినా మంచి మనసే ఎన్నుకోతగ్గది. ప్రేమకి, పెళ్ళికి విలకడ ఇచ్చేది మనసే. అందంకాదు. పార్వతికి మూతి కొంచెం ఎత్తు, కళ్ళు కొంచెం చిన్నవి-అంతే.


తెలుపు కాదన్న మాటేగానీ మరీ నలుపేంకాదు.

ఈ కారణాలకే పార్వతి ముప్పై ఏళ్ళ దాకా పెళ్ళి కాకుండా ఉండిపోయింది. అనుకోవటం సరికాదు. అసలు సమస్య ఆర్థిక సమస్య.

తండ్రి పార్వతిపెళ్ళిగురించి పట్టించుకోడు. కట్నం ఇవ్వలేక ఇద్దరు కూతుళ్ళకి చాలా కాలం క్రిందట ఎలాగో పెళ్లి చేశాడు కొడుకు లిద్దరికీ చదువు రావటం లేదు. అందుకని ఉద్యోగాలూ లేవు.

పార్వతి ఉద్యోగం చేస్తోంది.

"పెళ్ళి కాకపోతేనేం! హాయిగా బతుకుతోంది ఉద్యోగంచేసుకుని" అంటాడు. సంబంధాల కోసం ప్రయత్నించటంకూడా మానేశాడు.



ఎక్కడ విన్నా పదిహేనువేలు ఇరవై వేలు కట్నం.

తల్లి ఏడుస్తుంటుంది. చాటుగుండా మొగుణ్ణి తిడుతుంది. ఎప్పుడూ తన సుఖమే చూసుకుంటాడని.

ఇంట్లో పొయ్యి వెలిగినా మానినా అతడి సిగరెట్ మాత్రం వెలుగుతుండాలి.

అందరికీ మజ్జిగ ఉన్నా లేకపోయినా అతడికి ఆరుసార్లు కాఫీ కావాలి. డబ్బు లేనప్పుడు ఒకరి అవసరాలు ఇంకొకరికి లగ్జరీల్లా కనిపిస్తాయి.ఒకరోజు 'హిందూ'లో ఎడ్వర్టైజ్‌మెంట్ చూసి పార్వతి ఎగిరి గంతువేసింది. అంటే నిజంగా గంతు వెయ్యలేదు మనసుకి కలిగిన ఆవేశంతో, శరీరంతేలికై గాలిలోకి లేచిపోయినట్లుగా అనిపించింది.

"ఎలాగైనా ఈ పెళ్ళి చేసుకుని తండ్రికి బుద్ధి చెప్పాలి. హాయిగా ఉన్నానంటాడు. ఇస్త్రీ చీరకట్టుకోగానే పర్సులో పాతిక రూపాయలు ఉన్నంతమాత్రాన హాయి యిచ్చేస్తుందా? ఎవరు ఎదురుపడినా 'పెళ్ళెప్పుడు?' అని అడిగేవాళ్ళే. అది ఎంత బాధాకరమో ఆయన వచ్చే జన్మలో ఆడపిల్లయి పుట్టి పెళ్ళి కాకుండా ఉండిపోతేగానీ తెలియదు. కట్నంఅవసరం లేదుట. కులగోత్రాలు కుదురుతున్నాయి. అబూదాబీలో ఇంజనీరు. పదిహేను వేలు జీతం. ఓహ్! కార్లలో తిరగటం. విమానాల్లో ప్రయాణం.ఒంటినిండా బంగారం. ముఖ్యంగా మెడలో మంగళసూత్రం. తలెత్తుకు తిరగచ్చు. అవి ఉన్న ఆడవాళ్ల మొహంలో ఎంత గర్వం.

తనకి అన్ని అర్హతలూ ఉన్నాయి. తెలుపుకాదు అంతే. అట్లాగని మరినలుపు కూడా కాదు. అతడికి ఇరవై ఎనిమిదేళ్ళు. అదొక్కటే కలవని విషయం- పానకంలో పుడకలాగ. ఎట్లాగైనా సరే ఈ పెళ్ళి జరగాలి. మొదట కలిగిన ఆనందోద్రేకం తగ్గినా రెండు రోజులు ఆలోచించింది. చివరికి తెగించి ఉత్తరం రాసి ఫోటో జతచేసి కవరు పోస్టుచేసింది,మనసులోభయం పీకుతుంటే

'జవాబు వస్తే చూద్దాంలే' అనుకుంది.

* * *

'రాదు' అనుకుంది కానీ నెలతిరక్కుండానే జవాబు వచ్చింది. అతడి పేరు సుందర్.అతడికి పార్వతి ఫోటోనచ్చింది. వివరాలన్నీ అనుకూలంగా ఉన్నాయి. త్వరలో ఇండియాకు వస్తున్నారుట.తారీకు హోటల్ ఎడ్రస్ ఇచ్చి హైదరాబాద్‌లో కలుసుకోమన్నాడు.

తల్లికి జరిగిన సంగతి చెప్పింది పార్వతి. తండ్రికి చెప్పక తప్పలేదు. ఆయన నొసలు చిట్లించాడు.

"తీరి కూచుని మీకుఇటువంటి బుద్ధులు పుడుతున్నాయేం.ఎక్కడోపరాయిదేశంలో ఉన్నవాడు ఏం చేస్తున్నాడో ఎవరికి తెలుస్తుంది. తప్పకుండా ఏదో మోసం వుంటుంది. రెండో పెళ్ళో, మూడోపెళ్ళో కూడా తెలియదు. అక్కడికి తీసికెళ్ళి ఎవరికో అమ్మేసినా దిక్కులేదు. దౌర్భాగ్యపు వ్యవహారాలన్నీ జరుగుతున్నాయాదేశాల్లో చేసిన నిర్వాకం చాలు. ఇంక ఉత్తరాలు రాయకు" అన్నాడు.

# నేరపు స్వర్గం : సెప్టెంబరు 5

హఠాత్తుగా చూశాను నేను యీ మధ్యనే
పక్షుల రెపరెప ఆనందపు శీతల స్వర్గాన్ని
అక్కడ మంచు మండుతోంది భగభగ మండి మండి
మంచు అంతా గడ్డకట్టుతోంది.

ఆ మరుక్షణం.
ఆ మరుక్షణం నించీ
కల్పనా, హృదయం, పంచేంద్రియాలూ అన్నీ హడిలి
అడివిన పడి ప్రతిఆలోచన తునకా మాయం అయిపోయి
జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి మేఘాల మణిపురీ
నాట్యపు స్థిరాస్థిరత్వంతో.
అవియవ్వనపు రక్తపు రుతువులో వేడిపువ్వులు పూసినవీ
ఎప్పుడో భస్మం అయిన నేరపు ప్రేమ పరాగం
వొళ్ళంతా వెదజల్లబడినవీ

అయితే, అంతటి నేరమూ ఏ కారణాల బలంతో
నా భుజాల మీదే మోస్తూ కృంగుతూ భరించాను?
తుఫానులో చెట్టుకొమ్మ ఆఖరి ఆకులాగా
ఏ అతి వెలుతురు విషపు కాంతిలో వణికాను?

మంచు స్పర్శ తగులుతోంది, యిప్పుడిప్పుడే
మృత్యుశయ్య అలజడి ఆరిన తరువాత యీ నేరం యీ
భారం అన్యాయపు గుండు దెబ్బతిని,
నగ్నంగా రోడ్లమీద విసురుగా వెర్రిగా
పరుగెడుతుందా?
పక్షుల శీతల స్వర్గసీమ కుహరాల్లో
గడ్డకట్టి
స్వచ్ఛమైన స్ఫటికలాగా మెరుస్తుందా?
నువ్వే జవాబు చెప్పాలి నా ఓ....

—త్రిపుర

"మీరు వెళ్ళి మాట్లాడిరండి" అంది తల్లి.

"నేను వెళ్ళను. నన్ను అడిగి చేశారా?" అన్నాడాయన.

ఈసారి తల్లిఊరుకోలేదు. "మన రాత బాగుంటే అన్నీ బాగానే జరుగుతాయి. అసలు ప్రయత్నమే లేకపోతే ఎలా? దూరదేశం. పరాయి దేశం అని వంకలు పెడుతున్నారు. ఈ దేశంలో, ఈ ఊళ్ళో వాళ్ళనైనా పట్టించుకున్నారా? మోసాలు ఇక్కడా జరుగుతూనే వున్నాయి మన గీత సరిగ్గా లేకపోతే! దాన్ని తీసుకుని వెళ్ళండి. అన్ని విషయాలూ అనుమానాలు లేకుండా తేల్చుకోండి. మీ అంతట మీరు ఏ ప్రయత్నమూ చెయ్యరు. దాని తంటాలు అది పడుతుంటే అడ్డుపడకండి. తండ్రిగా పక్కన నిలబడండి చాలు" అంది.

* * *

అనుకున్న రోజున అనుకున్న వేళకి ఎడ్రస్ ప్రకారం హోటల్‌కి వెళ్ళారు పార్వతి, తండ్రి. రెండు రోజుల కోసం తెలిసిన వాళ్ళింట్లో దిగారు. పార్వతి స్నేహితురాలికి అక్క అవుతుందావిడ. ఆ ఏర్పాట్లనీ పార్వతే చేసుకుంది. పార్వతికి భయం వెయ్యటంలేదు అంతా మంచి జరుగుతుందని అనిపిస్తుంటే ధైర్యంగా హోటల్ మెట్లు ఎక్కి వెళ్ళింది. తలుపు తీసి ఇద్దరినీ లోపలికి ఆహ్వానించి తనని పరిచయం చేసుకున్నాడు. సుందరే తన పక్కనే ఉన్న అతడిని స్నేహితుడుగా పరిచయంచేశాడు. కూర్చున్నాక ఏం తాగుతారని అడిగి కాఫీ తెప్పించాడు.

ఛానల్‌లోంచి సంగీతం వస్తోంది. రూమ్ చాలా కోష్‌గా ఉంది.

"ఔను. బాగా సంపాదిస్తున్నాడుమరి" అనుకుంది పార్వతి.

కాఫీ అతడిని చూడగానే ఉత్సాహం కొంచెం చల్లారింది. ముప్పైదాటినట్లు కనిపిస్తున్నాడతడు నిజం వయసు చెప్పాడా? బొద్దుమీసాలున్నాయి. పొట్ట కూడా ఉంది. తండ్రితో మాట్లాడుతూ అతడుపార్వతినే పరిశీలిస్తున్నాడు. నవ్వుతూ పలకరిస్తున్నాడు ప్రశ్నలువేసి.... మధ్య మధ్య. అతడిస్నేహితుడు, తండ్రి మాటల్లో ఇద్దరి కుటుంబాల గురించి వివరాలు తెలుసుకుంటున్నారు. ఏదో బంధుత్వం కూడా ఉన్నట్లు బయటపడింది. పార్వతి తండ్రి సిగరెట్లు కొనుక్కోవాలన్నాడు.

స్నేహితుడు అతడిని తీసుకువెళ్ళాడు.

"నువ్వు ఇంకొంచెం తెల్లగా ఉంటావని ఊహించుకున్నాను" అన్నాడు సుందర్ పార్వతిని చూస్తూ.

"ఆడవాళ్ళకి పెళ్ళి అయ్యాక రంగు వస్తుంది" అంది పార్వతి నవ్వి.

"నేనుఎన్నోదాన్ని?" అని అడిగింది.

"అంటే?"

"ఇంకా ఉత్తరాలు వచ్చి ఉంటాయి మీ ఏడ్‌కి"

మూడు వచ్చాయి. ఒకటి నచ్చలేదు. మిగిలిన ఇద్దరిలో నిన్ను ఒక అమ్మాయిని చూశాను. ఇప్పుడు నిన్ను చూస్తున్నాను. నేను నిశ్చయించుకున్నాను అప్పుడే. నిన్ను చేసుకుంటాను నీకు ఇష్టమైతే!" అన్నాడు నవ్వుతూ. పెదవులుదాటని సన్నటి నవ్వు తనని బంధిస్తున్నట్లు అనిపించింది పార్వతికి.

"ఏమైనా అడగాలని ఉంటే అడగచ్చు" అన్నాడు రిలాక్స్‌డ్‌గా సోఫాలో వెనక్కి చేరబడి.

"మీకు ఇదివరకే పెళ్ళికాకుండా ఉంటే చాలు!" అంది నవ్వకుండా.

"అవలేదు" అన్నాడు నవ్వకుండానే. సూటిగా చూస్తూ.

అతడితో మాట్లాడటానికి సంకోచం కలగటంలేదు. ఏ సంగతైనా అతడితో

మాట్లాడగలను అనిపిస్తోంది.

"మీకేమైనా సందేహాలున్నాయా?" ప్రశ్నించింది.

"లేవు. మా మామయ్యకి మీ నాన్నగారి పేరు చెప్పాను. తెలిసిన వాళ్ళే. బంధుత్వం ఉంది అని చెప్పాడు- సంతోషించాడు."

మీకు నేను నచ్చానా?" అనడిగాడు.

"నాది కలలుకనే వయసుకాదు. మంచివాడు, నన్ను బాగా ఇష్టంగా చూసుకునేవాడు భర్తగా దొరకాలని నా కోరిక. మీమీద నమ్మకం కలుగుతోంది. మీకు నేను నిజంగా నచ్చానా? అదిచాలా ముఖ్యం" అంది. అతడికి తను నచ్చినట్లు అప్పటికే పార్వతికి నమ్మకం కలిగింది. అతడు పరిశీలనగా చూస్తున్న చూపుల్లో, ఆసక్తి, తృప్తి కనిపిస్తున్నాయి. పార్వతి అందగత్తె కాకపోయినా ఆరోగ్యంగా ఉంటుంది. అలతిగా మేకప్ చేసుకుంది. ఆ కాంబినేషన్ అతడిని ఆకట్టుకుంది.

"నా డ్రీమ్‌గర్ల్‌వనలేను. బట్ ఐ లైక్ యూ!" అన్నాడు. అతడు అబూదాబిలో తనపని. స్నేహితులు మొదలైన విషయాల గురించి చెప్తుంటే పార్వతి తండ్రి. స్నేహితుడు వచ్చారు. తాము ఉన్న ఇంటి ఎడ్రస్ ఇచ్చి పార్వతి. తండ్రి మర్నాడు సుందర్‌ని రమ్మని ఆహ్వానించి ఇంటికి వచ్చేశారు.

మర్నాడు అనుకున్న ప్రకారం సుందర్ వచ్చాడు.

పెళ్ళినిశ్చయంచేసుకున్నారు. సుందర్ పార్వతికి ఒక చీరె. రిస్టువాచీ ఇచ్చాడు. కట్నాలు లేవు. తల్లిని. మేనమామని తీసుకుని పెళ్ళికి వస్తానని. ముహూర్తం పెట్టించి ఉత్తరం రాస్తానని. చెప్పాడు.

సీ ఆఫ్ చెయ్యటానికి స్టేషన్‌కి వచ్చారు.

అతడిని వదిలి వచ్చేస్తుంటే పార్వతికి కళ్ళలో నీళ్ళు వచ్చాయి. ఇది మొదటిసారి చూడటం! అతడితో ఏమిటీ అనుబంధం!

ఎంత మంచివాడు! ఎంత సరదాగా, ఫ్రెండ్లీగా ఉంటాడు!

ఈ పెళ్ళి నిజంగా జరుగుతుందా? జరిగితే తను నిజంగా అదృష్టవంతురాలే!

* * *

పెళ్ళి జరిగిపోయింది అనుకున్న ప్రకారంగా.

పెళ్ళికి ఇద్దరి వేపు బంధువులూ వచ్చి పెళ్ళి అయిన వెంటనే వెళ్ళిపోయారు.

ఆడపెళ్ళివారూ మగపెళ్ళివారూ కలిసిపోయి సరదాగా గడిపారు. చుట్టరికాలు నెమరు వేసుకున్నారు. పెళ్లి కొడుకు మేనమామ, వకిపార్వతితండ్రి బాల్యస్నేహితుడు. అంతా వెళ్ళిపోయాక అతడు ఎవరూ లేకుండా చూసి సుందర్ దగ్గరికి వచ్చాడు.

"అంతా బాగానే ఉందనుకున్నాం కానీ నువ్వు మోసపోయావు. నారాయణ కూతురికి-అదే పార్వతికి పాతికకాదు ముప్పై ఏళ్ళు.... కొన్ని నెలలు తక్కువగా. మా పద్మనాభంతోటిది. అత్తయ్యకీ నారాయణ భార్యకి ఒకసారే డెలివరీ అయింది. ఇప్పుడింక చేసేదేముంది! ఐనా నువ్వు నిజంగా తెలియకే చేసుకున్నావా?" అనడిగాడు.

తెల్లబోయాడు సుందర్. మేనమామకి జవాబివ్వలేదు.

కోపంతో అతడి కళ్ళు ఎర్రబడ్డాయి. చీకటి పడుతున్నకొద్దీ అతడి మనసు ఉడికిపోతోంగి.

తెల్లచీర కట్టుకుని పాలగ్లాసుతో వచ్చిన పార్వతిని ఆపాదమస్తకం నిశితంగా చూశాడు. మొహం, కళ్ళు తడుముతున్నట్లు చూశాడు. ఎక్కడైనా మోసం కనిపిస్తుందేమోనని. పార్వతిని అట్లాగ చూస్తుంటే అతడిలో బాధ రేగుతోంది. తలలోని విచ్చుకుంటున్న మల్లెపూలు అతడిని చూసి ఫక్కుమని నవ్వుతున్నట్లు అనిపించింది.

"తీసుకోండి" అంది అతడికి దగ్గరగా నిలబడి పాలగ్లాసు అందిస్తూ. అతను పార్వతినే చూస్తున్నాడు. మూతికొంచెం ఎత్తుగా ఉన్నట్లు: కళ్ళు చిన్నవిగా ఉన్నట్లు అనిపిస్తోంది. కోపం పొంగుతోంది.

"అక్కడపెట్టు" అన్నాడు.

"ఊహూ అందుకోండి" అంది విలాసంగా.

"చాల్లే సరసం" అన్నాడు.

చిన్నబోయింది పార్వతి. గ్లాసు బల్లమీద పెట్టింది.

"అట్లాగున్నారేం?"

"ఎట్లా ఉన్నానూ!"

"మొహంలో ఏదో కోపం కళ్ళలో స్నేహానికి బదులు...."

"జాను మోసం చేసినవాళ్ళు బాగానే ఉంటారు. మోసగింపబడ్డవాళ్ళు...."

"మోసమా?"

"నీకెన్నేళ్ళు?"

పార్వతి మౌనంగా ఉండిపోయింది. కాళ్ళు వొణుకుతుంటే బలవంతగా నిలబడి ఉంది.


"నీకు ఇరవయ్యారేళ్ళని రాశావు. మామయ్యచెప్తే తెలిసింది. నువ్వు నాకంటే రెండేళ్ళు పెద్ద!"

ఎంత కోపం తెచ్చుకుందామనుకున్నా పార్వతికి కోపంరాలేదు. కన్నీళ్లువచ్చాయి.

"పైగా ఏడుస్తావెందుకు?" అతడి కంఠం కరుకుగా ఉంది.

"అబద్ధమాడితేగానీ నాకు పెళ్ళికాలేదు. ఆడదాన్ని. మరి మీరెందుకు అబద్ధమాడారూ?"

"నేనా?"



పార్వతి అతడి పక్కన కూచుంది.

"మా బామ్మకి మీ చిన్నమ్మమ్మ స్నేహితురాలు. ఆవిడ మా బామ్మతో మీగురించి చెప్పింది". వాడు మెట్రిక్ పాసయి కాలేజీలో చేరాడు. పరీక్షలు పాసుకాలేదు. విసుగుపుట్టి మానేశాడు. ఐతేనేం వాడి అదృష్టం ఎంతమందికి ఉంటుంది. నెలకి పదివేలు సంపాదిస్తున్నాడు' అంది. నేను విన్నాను. నేను గ్రాడ్యుయేట్‌ని. మీరు ఇంజనీర్ కాదు. మెట్రిక్ పాస్. నెలకి పదిహేనుకాదు పదివేలు కాబోలు సంపాదిస్తున్నారు. నా మనసు మండిపోయింది ఆ క్షణంలో. నా అహంకారం కాలిపోయింది ఈ పన్నెండు గంటల్లో. నేను ఊరుకున్నాను. నా మనసుని సరిపెట్టుకున్నాను ఇప్పుడు. ఐతే ఇప్పుడు మీరేంచేస్తారు?

నన్ను వదిలేస్తారా? విడాకులిస్తారా?"

ఆ కళ్ళలో భయం లేదు. అది వ్యంగ్యమో ప్రశ్నార్థకమో తెలియటం లేదు. దేనికైనా సిద్ధమే అన్నట్లుగా ఉంది భంగిమ.

సుందర్ ఉన్నట్టుండి నవ్వడం మొదలుపెట్టాడు.

పార్వతి అతడినే చూస్తోంది అయోమయంగా.

"భలే, మనమిద్దరం ఒకరి నొకరు మించినవాళ్ళం. దేవుడే కలిపాడు మన జంటని. ఇంకేంచేస్తాం? వచ్చినట్టు కాపరంచెయ్యాలి. ప్రేమించుకోవాలి పిల్లల్ని కనాలి. ఏదో "గొప్ప" ఈగో బూస్టర్ కోసం అబద్ధాలాడతాము కాబోలు" అన్నాడు సుందర్.

నెత్తిమీద బండ పడుతుందని తలచుకుంటుంటే మల్లెచెండువచ్చి తగిలినట్లుగా అయింది పార్వతికి.

వొళ్ళంతా, మనసంతా తేలికై పోతుంటే పార్వతి కూడా నవ్వింది.

"పోనీ మీకళ్ళకి ఎలా కనిపిస్తున్నాను నేను? ముప్పై ఏళ్ళ ముసలమ్మలాగ ఉన్నానా?" అని అడిగింది.

"నిజంగా పాతికేళ్ళ పడతిలాగే ఉన్నావు. అందుకేకదా నేను మోసపోయాడు. నీ వయసెంత అయితేనేం నన్ను వలలో వేసుకున్నావ్. అందం, వయసు కంటె మనసుముఖ్యం. నీకంటె తక్కువ చదువుకున్నవాణ్ణి. మోసంచేసినవాడిని.... నన్ను .... నువ్వు .... వదిలేసి .... ....

తన చేతిని అతని పెదవులకి అడ్డుపెట్టింది పార్వతి.

"ఇంకేం చెప్పొద్దు. నేను అర్థంచేసుకోగలను. మీకు ఒక సహచరి కావాలి, మీకు నేను ఉన్నాను. నేను కోరేది ఒక్కటే. మీరు నన్ను ప్రేమిస్తే చాలు. ఆ విషయంలో మాత్రం మోసంచెయ్యకపోతే చాలు" అంది.

మనసు రాగరంజిత మవుతుంటే, కరుణ తనుకరిగించివేస్తుంటే పార్వతి ప్రపంచ సుందరిలా కనిపిస్తుంటే ఆ అమ్మాయి చేతుల్ని తన చుట్టూ మలచుకున్నాడు సుందర్.

"తుమ్ నమానో మగర్ హకీకత్ హై
ఇష్క్ ఇన్సాన్‌కీకో జరూరత్ హై"
శ్రావ్యంగా వినిపిస్తోంది గజల్.

* * *

మానవ సంబంధాల మధ్య ఏర్పడిన ఈ అవగాహన నాకు ఎంతో తృప్తిని, ఆనందాన్ని ఇచ్చింది. అందుకే ఈ కథ రాయాలనుకున్నాను.

*

